

బీఆర్ఎస్ పార్టీ రూపొందించిన 'బలగం' యాడ్స్‌లోని ఓ సన్నివేశం

# ఆలోచింపజేస్తున్న బీఆర్ఎస్ 'బలగం' యాడ్స్

హైదరాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం 'బలగం' సినిమా థీమ్‌తో బీఆర్ఎస్ పార్టీ రూపొందించిన యాడ్స్ ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. శనివారం విడుదలైన ఈ ప్రకటనలు పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో వైరల్‌గా మారాయి. బలగం నేపథ్యంలో పార్టీ రూపొందించిన ఈ ఐదు యాడ్‌లు సినిమా థియేటర్లలో, టీవీల్లో ప్రదర్శించేందుకు ఆ పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే వినూత్నరీతిలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న బీఆర్ఎస్ పార్టీ తెలుగులో విజయవంతమైన 'బలగం' సినిమా థీమ్‌తో ప్రస్తుతం రూపొందించిన ఈ యాడ్స్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేండ్లలో సాధించిన విజయాలను, పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను, అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించడం కోసం బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాల్సిన అవసరాన్ని ఈ లఘు చిత్రాల్లో సృజనాత్మకంగా పొందుపర్చారు. ఈ ఏడాది మార్చిలో విడుదలైన 'బలగం' సినిమా సంచలనం సృష్టించింది. తెలంగాణ లో వ్యక్తుల జీవితాలను ప్రతిబింబిస్తూ రూపొందించిన ఈ చిత్రం.. ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొని అపూర్వ విజయాన్ని అందుకున్నది. గ్రామగ్రామాన ప్రొజెక్టర్లు, స్క్రీన్ల మీద ప్రదర్శించిన ఈ చిత్రానికి అన్నివర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.



శనివారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

# బీఆర్ఎస్‌లోకి మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి

- **నారాయణఖేడ్ రాజకీయాల్లో అనూహ్య మలుపు**
- **మారనున్న సమీకరణాలు**
- **మరింత సులువు కానున్న భూపాల్‌రెడ్డి గెలుపు**

నారాయణఖేడ్, నవంబర్ 11: రాజకీయ చాణక్యుడిగా పేరొందిన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావును కలిసిన విజయపాల్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి సాదరంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ప్రస్తుతం బీజేపీలో ఉన్న విజయపాల్‌రెడ్డి.. 1994లో టీడీపీ నుంచి నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి స్వయాన సోదరుడైన విజయపాల్‌రెడ్డికి నియోజకవర్గంలో మంచి క్యాడర్ ఉంది. ఆయన బీఆర్ఎస్‌లో చేరడం నారాయణఖేడ్ రాజకీయాల్లోనే అనూహ్య మలుపు తిరిగింది. ఈ పరిణామంతో రాజకీయ సమీకరణాలు మారి బీఆర్ఎస్ విజయం మరింత సులువు కానుంది. విజయపాల్‌రెడ్డి 1994 లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2008లో తెలంగాణ రాష్ట్ర సాధన వైపు అడుగులేసిన ప్రస్తుత ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో మహారెడ్డి కుటుం బం విడిపోయింది. ఇప్పుడు విజయపాల్‌రెడ్డి చేరికతో ఇటు బీఆర్ఎస్ కార్యకర్తల్లో.. మరీ ముఖ్యంగా మహారెడ్డి కుటుంబ అభిమానుల్లో నూతనోత్సాహం నిండింది.

**మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు**











